పెయింటింగ్ వేస్తున్న డైరెక్టర్ లక్ష్మి

ఆర్ట్ గ్యాలరీలో 'వాటర్ కలర్ ఆర్ట్ క్యాంప్'

కొండాపూర్, నవంబర్ 30: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శనివారం పరిచయ్ ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ కలర్ ఆర్ట్ క్యాంప్‌ను శనివారం ప్రారంభించారు. ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కే.లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆమె స్వయాన పెయింటింగ్ వేసి కళాకారులను ఉత్సాహ పరిచారు. కళాకారులు వేసిన పెయింటింగ్స్‌ను ప్రదర్శనలో ఉంచడంతో పాటు, డిసెంబర్ 1వ తేదీన ఆర్టిస్ట్ సంజయ్ అష్టపుత్రే, డాక్టర్ నీరజ్ రాజ్‌లతో ఆర్ట్ టాక్స్ ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన

కొండాపూర్, నవంబర్ 30: ప్రపంచ హెచ్ఐవీ, ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం చందానగర్‌లోని లేపాక్షి జూనియర్ కళాశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత పారామెడికల్ ఆఫీసర్ జీ.గురుప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల సరైన అవగాహన లేక ఎంతో మంది బలైపోతున్నారని.. వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన

జీడిమెట్ల, నవంబర్ 30: మహిళలపై జరుగుతున్న హింసపై జాతీయ ప్రచారంలో భాగంగా మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో శనివారం చింతల్‌లో సీడీఈడబ్ల్యూ కౌన్సెలింగ్ కేంద్రంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్ మాట్లాడుతూ.. మహిళల హక్కులు, వారికి అవసరమైన చట్టాలు, కుటుంబ సమస్యలు, వివాహ సంబంధ సమస్యలను చర్చల ద్వారా సామరస్యంగా ఏ విధంగా పరిష్కరించుకోవాలో సీడీఈడబ్ల్యూ సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ పీఎంయూ టీం, సీడీఈడబ్ల్యూ జీడిమెట్ల ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ సిబ్బంది సంతోషి, వెంకట నర్సమ్మ, విజయ, పలువురు ఎన్జీఓ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

జగద్గిరిగుట్ట, నవంబర్ 30: ఒక్క కెమెరా వంద కళ్లతో సమానమని సీఐ నర్సింహ తెలిపారు. జగద్గిరిగుట్ట లెనిన్‌నగర్ కాశీవిశ్వేశ్వర, అభయాంజనేయ స్వామి ఆలయ సముదాయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శనివారం ప్రారంభించారు. ఆలయ నిర్వాహకులను ఆభినందించిన ఆయన సామూహిక వేడికలు, కాలనీల్లో ఏర్పాటుకు స్థానికులు ముందుకు రావాలని సూచించారు. ఎస్ఐ శంకర్, కాలనీవాసులు, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బాలానగర్, నవంబర్ 30: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన బాలానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నర్సింహరాజు తెలిపిన కథనం ప్రకారం.. బాలానగర్‌లోని హెచ్ఏఎల్‌లో నివాసముండే నిర్మల (41) 29న పాలకేంద్రానికి నడుచుకుంటూ వెళ్తుండగా వేగంగా దూసుకొచ్చిన కారు నిర్మలను ఢీకొట్టింది. ఈ ఘటనలో నిర్మలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు దవాఖానకు తరలించగా చిక్సిత్స పొందుతూ శనివారం 30వ తేదీ సాయంత్రం మృతి చెందింది. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

పేదలంటే చులకనా..?

కుత్బుల్లాపూర్ రోడ్‌లో ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన గుడిసెను తొలగిస్తున్న దృశ్యం

- ఫుట్‌పాత్ ఆక్రమణల కూల్చివేతలపై వివక్షత
- ఇష్టానుసారంగా కూల్చివేస్తున్నారంటూ విమర్శలు
- నామమాత్రంగా ఫుట్‌పాత్ కూల్చివేతలు...?
- ఇష్టారాజ్యంగా పార్కింగ్‌లు.. ఇబ్బందుల్లో ప్రయాణికులు
- కుత్బుల్లాపూర్ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారుల తీరుపై పేదల మండిపాటు

కుత్బుల్లాపూర్, నవంబర్ 30: కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో ఫుట్‌పాత్ ఆక్రమణల కూల్చివేతలపై విమర్శలు తీవ్ర స్థాయిలో వెలువెత్తుతున్నాయి. సర్కిల్ 26 టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు కూల్చివేతల విషయంలో ధ్వంద వైఖరిని అవలంభిస్తున్నారంటూ స్థానికులు మండిపడుతున్నారు. జీడిమెట్ల, కుత్బుల్లాపూర్, సుభాష్‌నగర్, రంగారెడ్డి డివిజన్ల పరిధిలో ప్రధానంగా సుచిత్ర ప్రధాన రహదారి, కుత్బుల్లాపూర్ విలేజ్, పైపులైన్‌రోడ్డు మార్గం, ఐడీపీఎల్ జంక్షన్ నుంచి జగద్గిరిగుట్టకు వెళ్లే ప్రధాన రహదారిలో నిత్యం ట్రాఫిక్ సమస్యకు అంతరాయం కలుగుతుంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల్లోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఉన్న షాపింగ్‌కాంప్లెక్స్, ఇతర వ్యాపార సముదాయాలకు సంబంధించిన ప్రకటన బోర్డులు వంటి ఇతర వాటిని పూర్తిగా ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలను విస్తరించుకున్నారు. దీనికి తోడు ఆయా ప్రాంతాల్లోని తోపుడు బండ్లు, చిన్న గుడారాలు, ఇతర కొట్లు వంటివి ఏర్పాటు చేసుకొని మరికొంతమంది జీవనాధారం పొందుతున్నారు. ఇరువర్గాలకు సంబంధించినవన్నీ రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఆక్రమించి ఉన్నాయి. ఈ క్రమంలో ఫుట్‌పాత్ ఆక్రమణలు కూల్చివేసే సమయంలో కేవలం చిన్నచిన్న కొట్లు, తోపుడుబండ్లు, ఇతర గుడిసెలను మాత్రమే కూల్చివేస్తున్నారే తప్పా పెద్దపెద్ద షాపింగ్‌మాల్స్, ఇతర వాణిజ్య వ్యాపారాలకు సంబంధించిన వాటిని కూల్చడంలో వెనుకంజ వేస్తున్నారని విమర్శలకు తావునిస్తుంది. దీనికి తోడు కొంతమంది వ్యాపార నిర్వాహకులకు ఈ సమయంలో తమకు సంబంధించిన వాటిని పక్కన పెట్టుకొని తిరిగి రాత్రి వరకు యథాస్థానాలకు తెచ్చుకోవచ్చుననే ఉచిత సలహాలను సైతం టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఇస్తున్నట్లు మరికొంతమంది మండిపడుతున్నారు. సుచిత్ర చౌరస్తా నుంచి కొంపల్లి వరకు వెళ్లే ఎన్‌హెచ్-44 జాతీయ రహదారికి ఆనుకొని రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపార సముదాయాలకు సంబంధించిన ఫుట్‌పాత్‌లు అన్నీ ఆక్రమణకు గురయ్యాయి. ఫలితంగా ఆయా వ్యాపారసముదాయాలకు వచ్చే కస్టమర్లు తమ వాహనాలు బైపాస్ రోడ్లలో అక్రమంగా పార్కింగ్ చేయడం మూలంగా నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుందని, మరి అలాంటి వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం స్థానికులు అధికారయంత్రాంగాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి, ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన వాటన్నింటిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

శేరిలింగంపల్లి, నవంబర్ 30: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఫుట్‌పాత్ ఆక్రమణలను టౌన్‌ప్లానింగ్ అధికారులు శనివారం తొలగించారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు సెంట్రల్ యూనివర్సిటీ బస్‌డిపో నుంచి గుల్‌మోహర్‌పార్క్ కాలనీ వరకు ప్రధాన రహదారి పక్కన ఫుట్‌పాత్‌పై వెలసిన చిరువ్యాపారుల సముదాయాలను జేసీబీ సహాయంతో శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ అధ్వర్యంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఈ కూల్చివేతలు చేపట్టారు. దాదాపు 2 కిలోమీటర్ల మేరకు రహదారికి ఇరువైపులా ఉన్న దాదాపు 40కి పైగా చిరువ్యాపారాలను తొలగించారు.

కూకట్‌పల్లిలో గణిత ప్రతిభా పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఎంఈవోలు హరిశ్చందర్, కిషన్, రామకృష్ణ, గణిత ఫోరం సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

గణితంతో ఉజ్వల భవిష్యత్: ఎంఈవోలు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 30: గణితం నిత్య జీవితంలో అతి ముఖ్యమైనదని, గణితాన్ని కష్టంగా కాకుండా ఇష్టంగా సాధన చేస్తే అత్యుత్తమ ఫలితాలు సాధించడంతో పాటు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈవోలు హరిశ్చందర్, కిషన్, రామకృష్ణ తెలిపారు. శనివారం తెలంగాణ గణిత ఫోరం మేడ్చల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జాతీయ గణిత సంబురాలు-2024లో భాగంగా కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూకట్‌పల్లి, బాలానగర్, బాచుపల్లి మండలాల పదో తరగతి విద్యార్థులకు మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్ష పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు బహుమతి ప్రదానం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కూకట్‌పల్లి మండల ఎంఈవో హరిశ్చందర్, బాలానగర్ ఎంఈవో కిషన్, బాచుపల్లి ఎంఈవో రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులంతా భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. పోటీ పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో గణిత ప్రతిభ వెలుగులోకి వస్తుందని, విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొని సత్తాను చాటాలన్నారు. అనంతరం మండలాల వారీగా ఉత్తమ ప్రతిభను సాధించిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో జిల్లా తెలంగాణ మ్యాథమెటిక్స్ ఫోరం గౌరవ అధ్యక్షుడు గోవింద్, జిల్లా ఏఎస్ఓ అయ్యన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌రెడ్డి, పరీక్షాకేంద్రం కన్వీనర్ పర్శగళ్ల నర్సిములు, దమయంతి, శంకరప్ప, ప్రసన్న, భారతి, ఇందుమతి, కుసుమ, విద్యార్థులు ఉన్నారు.

పెగా టీచ్ ఫర్ చేంజ్ విజేతలకు ల్యాప్‌టాప్‌ల అందజేత

కొండాపూర్, నవంబర్ 30: పెగా సిస్టమ్స్ సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 56,780 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సామాజిక బాధ్యతలో భాగంగా ప్రతిభా పండుగ కార్యక్రమాన్ని నిర్వహించింది. టీచ్ ఫర్ చేంజ్ సామాజిక సేవా సంస్థతో కలిసి విద్యార్థులకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలకు శనివారం రహేజా మైండ్ స్పేస్ ఐటీ కారిడార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ల్యాప్‌టాప్‌లను అందజేసింది. విద్యార్థులలో సృజనాత్మకత, ఆంగ్లభాషా నైపుణ్యాలు, అభ్యాసంపై నిబద్ధతను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడిందని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేసి ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెగా సంస్థ ప్రతినిధులు, టీచ్ ఫర్ చేంజ్ సామాజిక సేవా సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం అభినందనీయం

జగద్గిరిగుట్ట, నవంబర్ 30: వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని సీఐ నర్సింహ తెలిపారు. జగద్గిరిగుట్ట సాయివిద్యానికేతన్‌లో శనివారం లయన్స్‌క్లబ్ ఆఫ్‌నార్త్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో శనివారం స్థానికులు, విద్యార్థులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన సీఐ లయన్స్‌క్లబ్ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, వినోద్‌జాదవ్, స్కూల్ కరస్పాండెంట్ ఆంజనేయులుతో ప్రారంభించారు. కార్యక్రమంలో ఐజేయూ మేడ్చల్ అధ్యక్షుడు బాలరాజుగౌడ్, ప్రిన్సిపాల్ శోభారాణి, కరస్పాండెంట్లు దయాకర్, ఎస్ఆర్.భాషా, సయ్యద్‌రషీద్, ఇమ్రాన్ తదితరులు మల్లారెడ్డి ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాంప్‌వాక్‌లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మమతారెడ్డి దంపతులు. చిత్రంలో కళాశాల చైర్మన్ మర్రిలక్ష్మణ్‌రెడ్డి

ఎంఎల్ఆర్ఐటీలో ట్రెడిషనల్ వేడుకలు

దుండిగల్, నవంబర్ 30: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(ఎంఎల్ఆర్ఐటీఎం), ఫార్మసీ కళాశాలల్లో శనివారం 'సారంగ్' పేరిట సాంప్రదాయదినోత్సవ వేడుకలు(ట్రెడీషనల్ డే)ను ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయా కళాశాలలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు రంగు, రంగుల సంప్రదాయ దుస్తులు ధరించి సంబురాల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పేలా విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. వేడుకల్లో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి మర్రి మమతారెడ్డి, చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ అనుశ్రేయారెడ్డి మాట్లాడుతూ.. ఇది ప్రతి ఒక్కరూ తమ సాంప్రదాయాలను తెలియజేసేందుకు ఈ వేడుకలను ప్రతి ఏడాది నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సంబురాల్లో కళాశాల డైరెక్టర్ డా.పీ.శ్రీధర్, ప్రిన్సిపాల్ డా.అర్జున్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు. క్లబ్ 64ప్రతినిధులు డా.ప్రవంతి, విజయసింహ, అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మమతారెడ్డి దంపతులు ర్యాంప్‌వాక్‌పై సందడిచేశారు.

అన్నమయ్యపురంలో ఘనంగా అంకితభావ దినోత్సవం

కార్యక్రమంలో వ్యాఖ్యానాన్ని అందిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మాదాపూర్, నవంబర్ 30: మాదాపూర్‌లోని అన్నమాచార్య భావనా వాహినిలో 41వ సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో శనివారం అంకితభావ దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు విచ్చేసి అన్నమయ్యపురం అధ్యక్షురాలు, పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు, శంకరాభరణం ఫేమ్ మంజు భార్గవి, సీటాడెల్ దర్శకులు ది ఫ్యామిలీ మెన్ ఫేమ్ రాజ్ నిడిమోరుతో కలిసి హాజరయ్యారు. ఇందులో భాగంగా పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు తన శిష్య బృందంచే ధ్యోస్మి గణరాజ గుణరాజ అంటు తొలుత గణపతిని ఆరాధించగా సందీప్, గాయత్రి, చైత్ర, రన్విత సంయుక్తంగా కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించి భక్తులను మెప్పించారు. అనంతరం చాగంటి కోటేశ్వరరావు చక్కటి వ్యాఖ్యానాన్ని అందించారు. వీరికి కీ బోర్డు రాజు, తబలా జయకుమార్ ఆచార్య వాయిద్యం అందించారు. అన్నమయ్య ప్రచార కర్తగా పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి స్వామి వారికి తీర్థప్రసాదాలను వితరించారు.

కూకట్‌పల్లి డీసీ హరికృష్ణయ్యకు.. పదవీ విరమణ శుభాకాంక్షలు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 30: కూకట్‌పల్లి సర్కిల్ ఉప కమిషనర్ హరికృష్ణయ్య పదవీ విరమణ చేశారు. శనివారం కూకట్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో జరిగిన పదవీ విరమణ సమావేశంలో హరికృష్ణయ్యకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కోఆర్డినేటర్ సతీశ్‌ఆరోరా, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కాండూరి నరేంద్రాచార్య, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్‌చౌహాన్, వివేకానందనగర్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, రిటైర్డ్ డీసీ రమేశ్, సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రమేశ్, ఇంజినీరింగ్ ఈఈ గోవర్ధన్, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబురావు, తూము శ్రవణ్‌కుమార్, కాండూరి నరేంద్రాచార్యతో పాటు పులువురు బీఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొని డీసీని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

అట్టహాసంగా నాట్య తోరణం

కొండాపూర్, నవంబర్ 30: భారతీయ సంప్రదాయ విభిన్న నృత్యరీతుల (ఆరు రకాలు)ను ఒకే వేదికపై ప్రఖ్యాత కళాకారులు ప్రదర్శించిన తీరును సందర్శకులను ఆకట్టుకున్నది. మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో శనివారం అమ్రిత కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'నాట్య తోరణం' నృత్య ప్రదర్శనల్లో వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలిచ్చిన వారిలో విఖ్యాత నాట్య గురువులు కళాకృష్ణ ఆంధ్ర నాట్యం, అనితా గుహ భరతనాట్యం, చావలి బాలత్రిపుర సందరి కూచిపూడి నృత్యం, నీనా ప్రసాద్ మోహినీ అట్టం, శామా భాటే కథక్, బిచిత్రానంద స్వైన్ ఒడిస్సీ, పేరిణి కుమార్ పేరిణి నాట్యం-ఆంధ్రనాట్య నృత్య ప్రదర్శనిలిచ్చారు. అనంతరం కళాకారులందరూ ఒకే వేదికపై ప్రదర్శించిన జుగల్‌బందీ ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ దేవాదాయ శాఖముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, రిటైర్డ్ ఐఏఎస్ తోట చంద్రశేఖర్, ఆదాయసన్ను శాఖ మాజీ ప్రిన్సిపాల్ చీఫ్ కమిషనర్ పీవీ రావు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శంభు కింకిణి నృత్యోత్సవాలు

కొండాపూర్, నవంబర్ 30: మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం పద్మకల్యాణ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన 'శంభు కింకిణి' నృత్యోత్సవాలు రెండు రోజుల పాటు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజున అరుణ స్వరూప్ మండోదరి శబ్దం, ఎంతచక్కని వాడే, జావళిలను కూచిపూడి నృత్య రూపకంలో ప్రదర్శించి ఆకట్టుకోగా, డెబీజాని బసు శివస్తుతి, తీన్‌తాల్, తుమ్రి, తులసి దాస్‌భజన్‌లను కథక్ నృత్య రూపకంలో నర్తించి అలరించింది. శ్రోభన మిత్ర దాస్ సెలబ్రేషన్ ఆఫ్ లైఫ్ అండ్ ఉమెన్ ఉడ్‌ను మణిపురి నృత్యరీతిల, సాయి మనస్విని ఆంధ్రనాట్యం ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. నృత్యోత్సవాలను తెలుగు యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రత్నశ్రీ, మధు, డాక్టర్ రుద్రవరం సుధాకర్, రొయ్యూరు శేషసాయి తదితరులు హాజరై తిలకించారు.

దుండిగల్ మున్సిపాలిటీ మేనేజర్ సునంద పదవీ విరమణ.. శుభాకాంక్షలు

దుండిగల్, నవంబర్ 30: దుండిగల్ మున్సిపాలిటీ మేనేజర్ సునంద శనివారం పదవీ విరమణ పొందారు. గండి మైసమ్మలోని పురపాలక సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణతో పాటు పలువురు పులువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేందర్ యాదవ్, నర్సారెడ్డి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ నేతలు జక్కుల శ్రీనివాస్‌యాదవ్, మురళి యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, బౌరంపేట్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ భవన్ కార్యాలయానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

ముదిరాజ్‌ల సంక్షేమానికి పెద్దపీట

బాలానగర్, నవంబర్ 30: ముదిరాజ్‌ల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం బాలానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో ముదిరాజ్ సామాజికవర్గం కార్యాలయం భవన నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయనను ముదిరాజ్‌లు ఆయనను శాలువాలు, పూలమాలతో ముంచెత్తారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వృద్ధిలోకి తీసుకురావడానికి తనవంతు సహకారం అందించనున్నట్లు స్పష్టం చేశారు. ముదిరాజ్‌లు వెనుకబాటు తనానికి గురై ఉన్నారని గుర్తించి వారిని ఎదగనీయడం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముదిరాజ్‌లు ఐఖ్యతను చాటి చెబుతూ ముదిరాజ్ సామాజికవర్గం ఎదుగుదలకు పాటుపడాలని సూచించారు. ముదిరాజ్‌లు ఆర్థికంగా రాజకీయంగా ఎదుగుదల కాకపోవడంలో ప్రధాన కారణం ఐఖ్యత కొరవడడమే అన్నారు. ఇప్పటికైనా ముదిరాజ్‌లు ఐఖ్యంగా ముందుకు వచ్చి తమ పురోగతిని చాటాలని సూచించారు. కార్యక్రమంలో బాంగారయ్య, బాలస్వామి, పిట్ల రాజు ముదిరాజ్, అంబటి శ్రీనివాస్, సుదర్శన్ ముదిరాజ్, మురళీధర్ ముదిరాజ్, స్వాతి, తులసీ, సోనీ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

నిరుద్యోగ మేళాను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, నవంబర్ 30: కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తెలిపారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని డీ.పోచంపల్లి సురక్ష గ్రీన్ మెడోస్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ కాలనీలో నెలకొన్న మౌలిక వసతులైన రోడ్ల నిర్మాణం మంజీరా నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధికి గత పదేండ్లకాలంలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పరిచామని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్త కాలనీలు వెలుస్తున్నాయని, రానున్న రోజుల్లోనూ అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సురక్ష గ్రీన్ మెడోస్ సంక్షేమ సంఘం సభ్యులు ప్రతినిధులు పాల్గొన్నారు.

– సూరారం డివిజన్, షాపూర్‌నగర్‌లోని ఎంజేఎస్ గార్డెన్‌లో ఆలిండియా పయం-ఈ-ఇన్సానియత్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను ఎమ్మెల్యే వివేకానంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో సూరారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సిద్ధిక్, సీనియర్ నాయకులు అమీర్‌ఖాన్, ఫిరోజ్, మోయిజ్ పాల్గొన్నారు.

శివదీక్ష వేడుకకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి ఆహ్వానం

జగద్గిరిగుట్ట, నవంబర్ 30: సుదీర్ఘకాలంగా ఆధ్యాత్మిక సేవలో కొనసాగడం అభినందనీమని ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. జగద్గిరిగుట్టకు చెందిన శివమాలధారులు కార్పొరేటర్ జగన్‌తో కలిసి ప్రతియేటా శ్రీశైలం పాదయాత్ర చేపడుతున్నారు. ఇందులో భాగంగా భక్తులకు నిత్యాన్నదానం, పూజలు కొనసాగిస్తున్నారు. ఈనేపథ్యంలో ఆదివారం ప్రత్యేక వేడుక జరుపుతున్నారు. కార్యక్రమంలో పాల్గొనాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను వారి నివాసాల్లో శనివారం కలిసి ఆహ్వానించారు.

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన ప్రజలు

దుండిగల్, నవంబర్ 30: ప్రజలకు అవరసమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంక్షేమసంఘాల సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నేతలు శనివారం శంభీపూర్‌లోని ఎమ